క్లుప్తంగా

వైభవోపేతంగా లక్ష తులసి పూజ



స్వామి సన్నిధిలో జక్కంపూడి విజయలక్ష్మి

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మీ స్వామిని దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ) ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు.

ఘనంగా యజ్ఞ అక్షతల వితరణ

కడియం: అయోధ్య నుంచి వచ్చిన యజ్ఞ అక్షతల వితరణ కార్యక్రమం బుధవారం మండల కేంద్రమైన కడియంలో ఘనంగా ప్రారంభమైంది. హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ దేవాలయాల కమిటీలు, భజన మండళ్లు, సత్సంగ కమిటీలు, ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కుంకుమ పెట్టి అక్షతలు అందజేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కడియం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా జమీందారు, గుబ్బల నాగార్జున అన్నారు. ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను బుధవారం వేమగిరితోట జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పితాని హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శారదా మాత జయంతి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న స్వామీజీ

ప్రకాశం నగర్: స్థానిక రామకృష్ణ మఠంలో బుధవారం శారదా మాత 171వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వేద విద్యానందజీ, స్వామి పరిజ్ఞేయానందజీ మాట్లాడుత శారదా మాత జీవితంపై సందేశం ఇచ్చారు. సుమారు 550 మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. 171 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వామి రఘు వీరానందజీ, స్వామీ సేవ్యానందజీ, స్వామీ ప్రజ్ఞానాధానందజీ పాల్గొన్నారు.

చిన్నారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

కడియం: అంగన్‌వాడీల సమ్మె కారణంగా చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఎం.సుజాత తెలిపారు. ఈ మేరకు పలువురు ప్రధానోపాధ్యాయులు ఆమెను బుధవారం కలిసారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భోజనాన్ని స్కూళ్ల ద్వారా అందిస్తున్నామని, వాటికి సంబంధించిన రేషన్ సరకులు పలు స్కూళ్లకు అందలేదని వివరించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్‌వోల ద్వారా రేషన్ సామగ్రి అందించేలా ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. ఎవరైనా ఇంకా సరకులు తీసుకోకపోతే సంబంధిత గ్రామాలకు చెందిన వీఆర్‌వోలను సంప్రదించాలన్నారు. తహసీల్దార్‌ను ఎంఈవోలు వి.లజపతిరాయ్, వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు జయరాజు, శ్రీనివాసరావు తదితరులు కలిశారు.

ఫిబ్రవరి 10 నుంచి సూర్యారాధన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పేపర్ మిల్లు రోడ్డు సీతంపేటలోని యాగ స్థలంలో ఫిబ్రవరి 10 నుంచి 25వ తేదీ వరకూ షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధన నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకుడు వడలి కుమార్ శర్మ చెప్పారు. ఈ కార్యక్రమానికి ఈనెల 5న రాటముహూర్తం చేస్తున్నామన్నారు. సీతంపేటలోని యాగ స్థలంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 10 నుంచి 25 వరకూ నిత్యం సూర్య నమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, హోమం, సుదర్శన మంత్రానుష్ఠానం, హోమం, లక్ష్మీగణపతి జపం, రుద్రాభిషేకం, హోమం ఉంటాయని వివరించారు. రథసప్తమికి విశేష ఆరాధనలు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమై, 10 గంటలకు ఉచిత కుంకుమార్చన, 11 గంటలకు సూర్య తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు.

ఎస్‌కేవీటీ విద్యార్థులకు బహుమతులు

కంబాలచెరువు: సేవ్ ది ఎనర్జీ అంశంపై గత నెల 22, 23 తేదీలలో ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని ఆ స్కూలు హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ప్రవల్లిక ప్రథమ, నూలు హేమంత్ కుమార్ తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విజేతలను పాఠశాలలో అభినందించారు.

స్వాగతం

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ లబ్ధిని రూ.3 వేలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు.

– రాజమహేంద్రవరం సిటీ





ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, డాక్టర్ శ్రీనివాస్, షర్మిలారెడ్డి, ముఖ్యమంత్రికి మెమెంటో అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు

పింఛన్ల పండగ.. ఆనందం నిండుగా..

- రేపు అర్బన్‌లో పింఛన్ల పంపిణీ
- 6న కడియం, రూరల్ మండలాల్లో అందజేత
- పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



లబ్ధిదారుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: కొత్త ఏడాది వైఎస్సార్ పింఛన్ కానుకను ప్రభుత్వం పండగలా పంపిణీ చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో శుక్రవారం రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ అర్బన్ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్, అధికారుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

కుటుంబానికి ఆసరా



వికలాంగుడైన నా భర్త మరణం తర్వాత కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని భయపడ్డాను. జగనన్న ప్రభుత్వం నాకు రూ.2750 పింఛన్ మంజూరు చేసి ఆదుకుంది. నా కుటుంబానికి ఆసరాగా నిలిచింది. ఇప్పుడు రూ.3 వేల పెంచడం ఆనందంగా ఉంది.

– లంకపల్లి విజయ మేరి, బొమ్మూరు

అలాగే ఈ నెల 6న కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేయనున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం మండలాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలు, కులమతాలకు అతీతంగా కొత్తగా 703 పింఛన్లు మంజూరు చేశారు. అలాగే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, కల్లుగీత, చేనేత, చర్మకార తదితర పింఛన్ లబ్ధిదారులకు రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచి అందజేయనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను తప్పకుండా పింఛన్ల సొమ్మును పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సమాజంలో గౌరవం



జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మాకు పెన్షన్ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. మాకు సమాజంలో గౌరవం పెరిగే విధంగా దివ్యాంగులతో సమానంగా తొలి నుంచి రూ.3 వేలు అందిస్తున్నారు. మా విషయంలో మానవత్వంతో వ్యవహరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– శ్రీగంగ, ట్రాన్స్‌జెండర్, రాజమహేంద్రవరం

జగన్‌కు కృతజ్ఞతలు



చర్మకార వృత్తి చేసుకునే మా కులస్తులకు 45 ఏళ్ల దాటితే వైఎస్సార్ పెన్షన్ పథకం కింద పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న ప్రభుత్వం నాలుగు నెలల క్రితం పింఛన్ మంజూరు చేసింది. ఈ నెల నుంచి రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచి ఇస్తున్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– తాతపూడి మోహన్, చర్మకారుడు, కొంతమూరు

రైలు ఎక్కుతూ జారిపడి ప్రయాణికుడి మృతి



రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ – లింగంపల్లి కోకనాడ ఎక్స్‌ప్రెస్ (07445) ఎక్కుతూ జారి పడటంతో గట్టి సురేష్ (42) అనే ప్రయాణికుడు మృతి చెందాడు. కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన సురేష్ బుధవారం హైదరాబాద్ వెళ్లేందుకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. మొదటి ప్లాట్‌ఫాం నుంచి రైలు ఎక్కుతూ జారి పడిపోయి, రైలు – ప్లాట్‌ఫాం మధ్య చిక్కుకు పోయారు. తోటి ప్రయాణికులు చైన్ లాగి రైలును నిలిపివేశారు. సురేష్‌ను బయటకు తీసి చూసే సరికీ అప్పటికే మృతి చెందాడు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకూ జయశ్రీ గార్డెన్స్, కోకా భాస్కరమ్మ నగర్, పిల్లి వారి స్ట్రీట్, జేఎన్ రోడ్, తోట రాములు నగర్ , శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఏవీ అప్పారావు రోడ్డు, సాయి నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, అద్దేపల్లి కాలనీ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో బుధవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం డివిజన్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మెండు కోదండరామ్ మాట్లాడుతూ 18 నెలలుగా బకాయిలు, సిబ్బంది నియామకాలు తదితర సమస్యలపై వెంటనే యూనియన్లను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీన ఒక గంట సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. నిరసనలో వివిధ సంఘాల నాయకులు పి.సతీష్, ప్రసాద్, అశోక్, షఫీ, యానాది శెట్టి, బీవీ కళ్యాణ్, కాళీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తూ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టారు. స్థానిక తాడితోట అంబేడ్కర్ విగ్రహం నుంచి దానవాయిపేట, స్వామి థియేటర్, గణేష్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా కార్మికులు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడారు. ధర్నా చేస్తున్న కార్మికులతో కమిషనర్ దినేష్‌కుమార్ చర్చించారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బిల్డర్ బాబి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బిల్డర్ బాబి నియమితులయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు నియామకపత్రం అందజేశారు. బాబి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రకాశం నగర్: ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కోసం పారిశ్రామికవేత్త అక్కిన శ్రీనివాస చౌదరి రూ.40,500 ఆర్థిక సాయాన్ని ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు చేతుల మీదుగా బుధవారం కళాశాలలో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ కొందరు విద్యార్థులు ఆర్థిక సమస్యలతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. వై.శాంతి, డి.నాగరత్నం, బి.దుర్గాప్రసాద్, ఎస్.చింటూ, ఈ.రాంప్రసాద్, శ్రీనివాస్, బి.వంశీ, బి.సాయి కిరణ్‌కు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ విభాగాధిపతి పీఏ కిషోర్ బాబు, డీవీ రమణమూర్తి, గాలి వెంకటరమణ, జి.సత్తిబాబు, సంజీవరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ విస్తృత దాడులు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గాయత్రీ ఇసుకర్యాంపు సమీపంలోని గోంగూరలంకల్లో బుధవారం మధ్యాహ్నం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, ,సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో దివాన్ చెరువు గ్రామానికి చెందిన కోమలి వినయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 250 లీటర్ల సారా, కారు, సారా తయారీకి ఉపయోగించే వంట పాత్రలు, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 4,600 బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడులలో నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, టెక్నికల్ ఎస్సై నాగేశ్వరరావు, సౌత్ ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా రాజమహేంద్రవరం

- టీడీపీ ఎమ్మెల్యేలు నగరానికి ఏంచేశారు!
- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరాన్ని ఈ నాలుగేళ్లలో సర్వాంగ సుందరగా తీర్చిదిద్దానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలనెవరిని అడిగినా చెబుతారన్నారు. ఆయనను పార్టీ సిటీ కో ఆర్డినేటర్‌గా అధిష్టానం నియమించిన సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా పార్టీ కార్యకర్తగానే ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారితో పోరాటం చేస్తానన్నారు. పార్టీ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. గత పుష్కరాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నగర అభివృద్ధికి రూ.2 వేల కోట్లు మంజూరు చేసిందని, ఆ ఖర్చు వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయగలరా అని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. పుష్కరాల ప్రారంభం రోజునే చంద్రబాబు ప్రచార వ్యామోహం కారణంగా 29 మందిని పొట్టనబెట్టుకున్నారని, మృతుల కుటుంబాలను కనీసం పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. ఐదేళ్లలో రాజమండ్రి అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలుగా ఉన్న టీడీపీ నాయకులు ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. కనీసం అసెంబ్లీలో కూడా ఏ సమస్యపైనా మాట్లాడింది లేదన్నారు. తాను ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానన్నారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల ముందుకు వెళతానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వైఎస్సార్ సీపీ జాబితాలో కొందరు సిట్టింగ్‌లను ఇన్‌చార్జులుగా నియమించకపోవడంపై అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరూ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులేనని, అవకాశం రాని వారిని భవిష్యత్తులో వివిధ పదవుల్లో నియమించి, తగిన గుర్తింపునిస్తారన్నారు. వై నాట్ 175 నినాదంతో ముందుకు వెళుతున్న జగనన్న నిర్ణయాలను స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు.

నగరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

- ఎన్నికల్లో విజయానికి సమష్టి కృషి
- ఎంపీ, కోఆర్డినేటర్ భరత్ రామ్



ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే ఎన్నికల్లో సమష్టి కృషితో విజయం సాధించి నగరంలో వైఎస్సార్ సీపీ ఎగురవేద్దామని, జగనన్నకు కానుకగా ఇద్దామని ఎంపీ, పార్టీ అర్బన్ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం రాత్రి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ఎంపీగా ఈ నాలుగున్నరేళ్లలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. మూడుసార్లు మేయర్లుగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన టీడీపీ నాయకులు ఈ నగరానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు రూ.2 వేల కోట్లు మంజూరైతే ఆ నాయకులందరూ కలిసి స్వాహా చేశారన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి రెండోసారి కూడా మంజూరు కాకుండా అడ్డుకోవడానికి దుష్ట శక్తులు ప్రయత్నించినా, కేంద్రంతో పట్టుపట్టి మంజూరు చేయించానన్నారు. పార్టీలో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు రుడా చైర్మన్ పదవి మొదటే రావాలని, మరింత ఉన్నత పదవులు వస్తాయనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్‌ల సేవలను పార్టీ అధిష్టానం గుర్తించిందని, రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. గోదావరి ప్రక్షాళనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన బూరాడ భవానీ శంకర్ మృతి బాధాకరమని, ఈ విషయాన్ని సీఎం జగనన్న దృష్టికి తీసుకువెళ్లానన్నారు. సీఎం జగనన్న తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారని, రూ.10 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారని తెలిపారు. అందుకు సంబంధించి చెక్‌ను సమావేశంలో భవానీ శంకర్ భార్య కృష్ణమాధురికి ఎంపీ భరత్ అందజేశారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బీసీ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లలో అవగాహనకు ప్రదర్శనలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఇప్పటికే ఏ నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఎప్పుడు ఈ ప్రదర్శన జరుగుతుందనే విషయంపై రాజకీయ పార్టీలకు షెడ్యూల్ అందజేశామని చెప్పారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం తన చాంబర్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషించాలని కోరారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ అత్యంత పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎప్పటికప్పుడు ఫారం 6, 7 , 8 దరఖాస్తులు పరిష్కరిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకుని ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకునేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని, రానున్న ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ జి.నరసింహులు కూడా పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు పొందాలి

రాజమహేంద్రవరం సిటీ: అర్హులందరూ ఓటు హక్కు పొందాలని కమిషనర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరపాలక సంస్థ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెండా పంజా రోడ్డులో వందమంది ట్రాన్స్‌జెండర్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులతో మాట్లాడారు. సమావేశంలో అదనపు కమిషనర్ సత్యవేణి, జేఎస్ఆర్ అన్నమయ్య పాల్గొన్నారు.

చిన్నారి మహేష్ వైద్య చికిత్సకు చర్యలు



మహేష్ కాలుని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: చిన్నారి కొల్నాటి మహేష్ వైద్య చికిత్సకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత అన్నారు. మహేష్ తల్లి దివ్యశాంతి, బంధువు వై.రామ్ కుమార్ బుధవారం కలెక్టరేట్‌లో మాధవీలతను కలిసి బాలుడి పరిస్థితిని వివరించారు. రెండేళ్ల కిత్రం రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో విజయవాడలో బాలుడి గ్రహణం మొర్రికి (కాలికి) శస్త్ర చికిత్స చేశారు. రెండేళ్ల తరువాత రావాలని డాక్టర్లు సూచించారు. బాలుడి తండ్రి శ్రీను కూలీ పనులు చేస్తుంటాడు. మరోసారి బాబుకు వైద్యం చేయించడానికి ఆర్థిక పరిస్థితి అనుకూలించడం లేదు. దీంతో సాయం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసంఅత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహేష్ వైద్య చికిత్స కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

సావిత్రీబాయి సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: మహిళా విద్య కోసం సావిత్రీ బాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సావిత్రీ బాయి జయంతి నిర్వహించారు. రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, చాగంటి నరసింహారావు, తనబుద్ధి సూర్యభాస్కర్, దున్న సుమన్ పాల్గొన్నారు.

కడియం: ప్రథమ ఉపాధ్యాయురాలిగా సావిత్రీ బాయి పూలే సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. వేమగిరి కొండపైగల బుద్ధవిహారాలో ఆమె జయంతి నిర్వహించారు. మర్రి సుబ్రహ్మణ్యం, మూర్తి, నల్లరాజు, రాములమ్మ, సతీష్, మహోదయ యాజరా పాల్గొన్నారు.

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సావిత్రి బాయి పూలే విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త బి.భవాని, డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ సీతామహాలక్ష్మి, డాక్టర్ జె.సురేష్ పాల్గొన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

కంబాలచెరువు: రాష్ట్ర స్థాయిలో వీజేఆర్ డయాబెటిస్ సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సీతంపేట చైతన్య స్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.మహేశ్వర రావు బుధవారం తెలిపారు. ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు. వారికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆ విద్యార్థులను పాఠశాల ఏజీఎం ఎంవీ సురేష్, రీజినల్ ఇన్‌చార్జి వై.రామాంజనేయులు, అకడమిక్ కో ఆర్డినేటర్ రామారావు, డీన్ కె.రాజు అభినందించారు.



సావిత్రీబాయి జయంతిలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అభివృద్ధిని చూసే వైఎస్సార్ సీపీలో చేరికలు

- ఎంపీ భరత్ రామ్
- పార్టీలో చేరిన టీడీపీ శ్రేణులు



వైఎస్సార్ సీపీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న పాలనలో నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్ అన్నారు. బుధవారం నగరంలోని 38వ డివిజన్‌లో అరిగెల బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి రుద్రరాజు రమణమ్మ నేతృత్వంలో పలువురు మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. రమణమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, కానీ ఆ పార్టీ నాయకులకు ఏ మాత్రం విశ్వాసం లేదన్నారు. ఎంపీ భరత్ రామ్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా, పెన్షన్ కావాలన్నా ఎంతో కష్టమయ్యేదన్నారు. జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని రమణమ్మ కొనియాడారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చేలా కష్టించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

పార్కుకు ప్రారంభోత్సవం

ఆదివారం వస్తే మద్యం తాగి ఆకతాయిల సృష్టించే బీభత్సంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని 9వ డివిజన్‌కు చెందిన మహిళలు ఎంపీ భరత్‌రామ్ ఫిర్యాదు చేశారు. బుధవారం ఏవీ అప్పారావు రోడ్డు మహాలక్ష్మి గుడి వీధిలో నగర పాలక సంస్థ నిధులు రూ.50 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును ఎంపీ ప్రారంభించారు. పార్కు నాలుగు వైపులా విద్యుత్తు దీపాలు ఎక్కువ పెట్టాలని ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావుకు ఎంపీ సూచించారు. పలువురు మహిళలు వచ్చి విద్యుత్ దీపాలు ఉన్నా వాటిని పగలగొట్టి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంకిస భవానీ ప్రియ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జి దాసి వెంకటరావు, పోలు విజయలక్ష్మి, నక్కా నగేష్ పాల్గొన్నారు.